# 1

# దేవుని రాజ్యము

"ఆయన మనలను అంధకారసంబంధమైన అధికారములోనుండి విడుదలచేసి,
తాను ప్రేమించిన తన కుమారునియొక్క రాజ్య నివాసులనుగా చేసెను" (కొలస్సీ. 1:3).

"మహా సముద్రము ఏనుగు ఈదగలిగినంత లోతైనది అయితే దాని తీరాలయందు చిన్న బిడ్డ ఈదగలిగినంత లోతులేనిది" అని ఎవరో ఒకరు అన్నారు. నిజంగానే మహా సముద్రానికి విభిన్న స్వభావాలున్నాయి. దానికి తీరపు గీత, లోతులేని నీళ్లు, అయినప్పటికి గంభీరమైన లోతులు, విస్తరించిన నమ్మశక్యముకాని వెడల్పు ఉంది.

అలాగే, క్రొత్త నిబంధన సంఘానికి అనేక రకములైన ముఖరూపాలున్నాయి. పని చేసే దాని ఏకత్వాన్ని, క్రీస్తుతో ఉన్న మన ఐక్యతను గూర్చి మనం ఆలోచించినప్పుడు, మనం సంఘాన్ని క్రీస్తుయొక్క శరీరంగా చూస్తాం (రోమా 12:5). ఆయన సంఘమందు మనం పొందే ప్రేమ, సహాయము, సహవాసాన్ని గూర్చి మనం తలంచేటప్పుడు, మనం దానిని దేవుని కుటుంబంగా చూస్తాం (ఎఫెసీ. 2:19). దేవుని ఏలుబడి, ఆయన పరిపాలనా దృష్టినుండి మనం చూచినప్పుడు, భూమిమీద దేవుని రాజ్యంగా మనం దాన్ని గుర్తిస్తాం (మత్తయి 16:16-18).

వివిధములైన ఈ వర్ణనలు ఒకదానితో నొకటి విభేదించవు, కాని (తర్జుమావలన) సంఘము అని మనం పిలిచే సంయుక్తమైన స్వభావముగల దైవికమైన యింద్రియముగల సంఘటిత శరీరాన్ని ఉదహరించడానికి యివన్నీ ఏకంగా కలిసిపోతాయ్. సిలువద్వారా క్రీస్తు ప్రసాదించిన అనేకమైన పరిశుద్ధ లక్షణములు దానియందు స్వాభావికమైనవిగా నిలిచియుండడమే క్రొత్త నిబంధన సంఘముయొక్క మహిమయైయున్నది.

నిరాక్షేపముగా, సంఘమును రాజ్యముగా చూడమని పరిశుద్ధాత్మ మనలను కోరుతున్నాడు. క్రీస్తులోనికి మార్చబడడాన్ని, అంధకార సంబంధమైన అధికారంలోనుండి క్రీస్తురాజ్యంలోనికి మార్చబడడమేనని పౌలు పలికాడు: "ఆయన మనలను అంధకార సంబంధమైన అధికారములోనుండి విడుదలచేసి తాను ప్రేమించిన తన కుమారునియొక్క రాజ్యనివాసులనుగా చేసెను" (కొలస్సీ. 1:13). మార్పు అనేది క్రీస్తు శరీరంలోనికి ప్రవేశించడమని క్రొత్త నిబంధనలో మరోచోట వర్ణింపబడినందున (ఉదా. రోమా 6:3; గలతీ. 3:27), మరియు క్రీస్తు శరీరము సంఘమని తెలుపబడినందున (ఎఫెసీ. 1:21-23), సంఘము, క్రీస్తు శరీరము, మరియు క్రీస్తు రాజ్యము (లేక దేవుని రాజ్యము) ఒకే ఆత్మ సంబంధమైన ఆర్గానిజంగా (సంఘటిత శరీరంగా) మనం చూడాలని పరిశుద్ధాత్మ ఉద్దేశిస్తున్నాడు.

"రాజ్యము" అనే పదం బైబిల్లో కనీసం ఆరు సందర్భాల్లో ఉపయోగింపబడింది. (1) అది భూసంబంధమైన, మత రహిత, ప్రభుత్వపు ఏలుబడికి ఉపయోగింపబడింది

(మత్తయి 4:8) (2) పాత, క్రొత్త నిబంధనలలో "దేవుని ఏలుబడి" అనే భావనను తెలియజేయడానికి ఉపయోగింపబడింది. దేవుడు ఇశ్రాయేలును ఏర్పరచబడిన తన జనంగా పద్ధతి ప్రకారం చేసికొన్నప్పుడు, ఆయన దానిని తన రాజ్యంగా గుర్తించాడు (నిర్గమ. 19:5, 6). (3) దేవుని యొక్క పరిపాలన లేక శక్తిని గూర్చి అది ఉపయోగింపబడింది (మత్తయి 12:28). ఎక్కడ దేవుని చిత్తానికి విధేయత చూపబడిందో అక్కడ దేవుని యొక్క పరిపాలన లేక దేవుని రాజ్యము ఉంది. (4) పరలోకమందు దేవుని పరిపాలనకు అది వినియోగింపబడింది. క్రైస్తవ సద్గుణాలలో పెంపారమని పేతురు మనలను హెచ్చరించగా, పరలోకము మన ప్రభువుయొక్క నిత్యరాజ్యముగా అతడు సూచించాడు: "ఆలాగున మన ప్రభువును రక్షకుడునైన యేసుక్రీస్తు యొక్క నిత్యరాజ్యములో ప్రవేశము మీకు సమృద్ధిగా అనుగ్రహింపబడును" (2 పేతురు 1:11). (5) అది సంఘానికి వర్తించబడింది. సంఘము పరలోక రాజ్యము యొక్క భూసంబంధమైన ప్రదర్శనం. అందువలన, పరలోక రాజ్యమని (మత్తయి 16:18, 19), దేవుని రాజ్యమని (యోహాను 3:5), తన ప్రియ కుమారుని రాజ్యమని (కొలస్సీ. 1:13) అది సూచింపబడింది. (6) అపవాది యొక్క ఆధిపత్యానికి ఆ పదం ఉపయోగింపబడింది. ఇది "సాతాను రాజ్యము" అనే పద ప్రయోగంతో వాని శక్తి తెలుపబడింది (మత్తయి 12:26).

సంఘము దేవుని రాజ్యమని చూపించబడడం ప్రోత్సాహకరంగాను, ఉపాయంతో కూడిందిగాను ఉంది. ప్రత్యేకించి, ప్రభువు యొక్క భూసంబంధమైన రాజ్యమైన, సంఘము యొక్క స్వభావ లక్షణాలపైన మన దృష్టి నిలుపుదాం.

## ఆత్మ సంబంధమైన రాజ్యము

దాని ప్రాథమికమైన స్వభావంలో, సంఘము ఆత్మసంబంధమైన రాజ్యము, అది భౌతికమైనదో పదార్థ సంబంధమైనదో కాదు. పిలాతు ప్రభువైన యేసును "నీవు యూదులకు రాజువా?" అని అడిగినప్పుడు (యోహాను 18:33), ఆయన "నా రాజ్యము ఈ లోకసంబంధమైనది కాదు; నా రాజ్యము ఈ లోకసంబంధమైనదైతే నేను యూదులకు అప్పగింపకుండునట్లు నా సేవకులు పోరాడుదురు గాని నా రాజ్యము ఇహసంబంధమైనది కాదనెను" (యోహాను 18:36).

రాజ్యము యొక్క ఆత్మసంబంధమైన స్వభావము సంఘాన్ని గూర్చిన ప్రముఖమైన సత్యాలను పరిచయం చేస్తుంది. మొదటిది, సంఘంయొక్క కేంద్రస్థానం పరలోకంలో ఉంది గాని భూమిమీద లేదు. పరిపాలించు మన రాజైన క్రీస్తు, పరలోకమందు దేవుని కుడిపార్శ్వమున ఆసీనుడైయున్నాడు (అపొ. 2:33). దేవుని భూసంబంధమైన రాజ్యమైన సంఘాన్ని కాలాంతంవరకు పరిపాలించి, అప్పుడు తండ్రియైన దేవునికి ఆయన దానిని అప్పగిస్తాడు (1 కొరింథీ. 15:24). ఈలాగున, ప్రభువైన యేసు యొక్క ఆధిపత్యానికి తమ్మును తాము లోబరచుకొనడం ద్వారా క్రైస్తవులు దేవుని ఏలుబడి క్రిందికి ప్రవేశించిన జనులైయుంటారు (ఫిలిప్పీ. 2:9-11).

రెండవది, క్రైస్తవుల జీవితము, పని, ఆరాధన ఆత్మసంబంధమైన దానిమీదనే గాని

భౌతికమైన దానిమీద కేంద్రీకరించబడదు. మనం ఆత్మసంబంధమైన పోరాటం చేస్తాం (ఎఫెసీ. 6:12). ఆత్మసంబంధమైన బలులు అర్పిస్తాం (1 పేతురు 2:5), ఆత్మసంబంధమైన భోజనంతో జీవిస్తాం (హెబ్రీ. 5:12-14), పరలోక పౌరత్వంగల ప్రజలుగా భూమిమీద యాత్రికులమై జీవిస్తాం (ఫిలిప్పీ. 3:20; 1 పేతురు 2:11).

---

దేవుడు మన హృదయాలపై
ఏలుతూ పరిపాలించుతున్నప్పడు మనము దేవుని
రాజ్యపౌరులమై యుంటాం.

---

మూడవది, ఆత్మసంబంధమైన రాజ్యపు సభ్యులంగా, లోకము యొక్క పదార్థ సంబంధమైన వాస్తవాలు పరలోకమందలి ఆత్మసంబంధమైన మన పౌరత్వంచే పాలింప బడాలి. నిత్యత్వపు అద్దంగుండా మనం చూచినప్పుడు ఈ జీవితం తళతళ మెరిసే పనికిరాని తగరంగా దాన్ని చూస్తాం.

అపవాదికి క్రైస్తవునికి మధ్య ఊహించిన సంభాషణను ఒకరు ప్రతిపాదించారు. అపవాది క్రైస్తవునితో, "క్రైస్తవుడా నేను నీకు సమస్తం యిస్తాను. ఇండ్లు, భూములు, డబ్బు యిస్తాను" అని అన్నాడు. అందుకు క్రైస్తవుడు, "నాకు సమస్తం ఉన్నాయి. నా తండ్రి ఈ లోకానికి అందులో ఉన్న సమస్తానికి సొంతగాడు. నీవు నాకు ఏమీ యివ్వలేవు, ఎందుకంటే నాకు సమస్తమున్నాయి" అని బదులిచ్చాడు. అపవాది మరల ప్రయత్ని స్తున్నాడు: "సమస్తాన్ని నేను నీ వద్దనుండి తీసివేస్తా. నేను నీ యింటిని, నీ సుఖాలను, నీ డబ్బును తీసివేస్తా"నన్నాడు. అందుకు క్రైస్తవుడు, "నీవు నా వద్దనుండి ఏమియు తీసివేయలేవు. నాకంటూ ఏమియు లేదు. నాకున్న సమస్తం దేవునికి అర్పించబడ్డాయి. నేను ఆత్మసంబంధమైన ఆయన రాజ్యానికి సంబంధించినవాడను, గనుక నా నిజమైన విలువలు ఆత్మసంబంధమైనవే" అని చెప్పాడు. అపవాది యింకను మరోసారి ప్రయత్నిం చాడు: "నేను నిన్ను చంపుతా, నేను నీ ప్రాణం తీసివేస్తా"నని అన్నాడు. అందుకు క్రైస్తవుడు, "నా మట్టుకైతే బ్రదుకుట క్రీస్తే చావైతే లాభం" అని బదులిచ్చాడు. అపవాది చివరి ప్రయత్నం చేశాడు: "నేను నిన్ను యిబ్బందిలో బ్రతికేలా చేస్తాను. పాపులు చేస్తున్న ఆనందదాయకమైన పనులన్నీ నీకు చూపుతాను, నీవు వాటిని చేయలేకుంటావు. నీవు అసంతృప్తిలో జీవిస్తావు" అని అన్నాడు. అందుకు క్రైస్తవుడు, "నా అత్యున్నతమైన సంతోషము ప్రభువైన యేసు చిత్తం జరిగించడమే"నని ప్రకటించాడు. ఆత్మసంబంధమైన దేవుని రాజ్యములో సభ్యుడైయుంటే, లోకాన్ని దాని శోధనలను వేరైన వెలుగులో నిలుపుతాయి. "లోకమును దాని ఆశయు గతించిపోవుచున్నవిగాని, దేవుని చిత్తమును జరిగించువాడు నిరంతరమును నిలుచును" అని యోహానుతో చెప్పేలా అది మనకు సహాయపడుతోంది (1 యోహాను 2:17).

పరలోక రాజ్య పౌరులు లోకాన్ని లోకులవలె చూడరు. లౌకికులైన జనులు వారి ఆస్తులను గూర్చి, ప్రస్తుతాన్ని గూర్చి, భవిషత్తును గూర్చి, మరియు లోక వ్యవహారాలను

గూర్చి ఆందోళన పడుతుంటారు. క్రైస్తవులు లోకంలో ఉన్నా, వారు దానికి సంబంధించిన వారు కారు. మనం ఆత్మసంబంధమైన రాజ్యమునకేగాని, భౌతికమైన దానికి చెందినవారం కాము. మన భక్తి ఆత్మసంబంధమైనది, భౌతికమయ్యింది కాదు. రోగులకు సేవ చేస్తూ, ఆకలిగొనినవారికి ఆహారమిస్తూ, లోకం నివాస యోగ్యమైనదిగా చేయడానికి మనం చేస్తూ కూడ, మన హృదయపు నిజమైన అక్కరలు నిత్యమైనవి. మనం కలిసికొనే ప్రతివారిని ఆత్మ సంబంధమైన రక్షణ వెంటాడునట్లు నడిపిస్తాం. ఆత్మసంబంధమైన గమ్యాల కొరకు మనం జీవిస్తాం, లోకసంబంధమైన వాటికొరకు కాదు. లోకసంబంధులగు జనులు తగువాటిని అమ్ముతారు; క్రైస్తవులు నూతనమైన ఆత్మలను వెదకుతారు.

## నీతి రాజ్యము

రెండవది, సంఘము నీతి రాజ్యం. రాజ్యంలో ప్రవేశించకముందు ఎలా జీవించారో పరలోక రాజ్య పౌరులు అలా జీవించరు. రాజ్య సంబంధులైన పిల్లలు వెలుగు సంబంధులు అని పౌలు అన్నాడు: "మీరు పూర్వమందు చీకటియై యుంటిరి, ఇప్పుడైతే ప్రభువు నందు వెలుగైయున్నారు. వెలుగు ఫలము సమస్త విధములైన మంచితనము, నీతి, సత్యమను వాటిలో కనబడుచున్నది. గనుక ప్రభువుకేది ప్రీతికరమైనదో దానిని పరీక్షించుచు, వెలుగు సంబంధులవలె నడుచుకొనుడి" (ఎఫెసీ. 5:8–10). అతడింకా యిలా అన్నాడు, "దేవుని రాజ్యము భోజనమును పానమును కాదు గాని, నీతియు సమాధానమును పరిశుద్ధాత్మయందలి ఆనందమునై యున్నది" (రోమా 14:17).

నీతిని క్రొత్త నిబంధన రెండు విధాలుగా పలుకుతుంది. ఒకటి, **విస్తరింప చేయబడిన నీతి**, యిది దైవ ప్రేరేపితులైన లేఖికుల ద్వారా తరచుగా పలుకబడింది. మనం క్రైస్తవులమై నప్పుడు, నీతి మనకు ప్రసాదింపబడింది మరియు దేవుని యెదుట మనం నీతిమంతులముగా తీర్చబడ్డాం. క్రీస్తులోనికి మార్పు చెందేటప్పుడు, "క్రీస్తుయేసునందలి విమోచనము ద్వారా ఉచితముగా నీతిమంతులని తీర్చబడుచున్నారు" (రోమా 3:24).

క్రొత్త నిబంధన **ప్రదర్శింపబడు నీతిని** కూడా సూచిస్తుంది. క్రైస్తవులు అందులో నడుచుకోవాలి, లేదా నీతిని అలవాటు చొప్పున కనుపరచాలి. యోహాను యిలా వ్రాశాడు, "... ఆయన నీతిమంతుడైయున్నట్టు నీతిని జరిగించు ప్రతివాడును నీతిమంతుడు" (1 యోహాను 3:7). పాపంలో "జీవించడం" లేక "నడవడం" క్రైస్తవులకు తగని పనియని యోహాను యిలా అన్నాడు, "... పాపము చేయువాడు అపవాది సంబంధి ... దేవుని మూలముగా పుట్టిన ప్రతివానిలో ఆయన బీజము నిలుచును గనుక వాడు పాపము చేయడు ..." (1 యోహాను 3:8, 9). అందునుబట్టి, దేవుని రాజ్యము నీతి రాజ్యము; దానిలో ప్రవేశించినవారికి నీతి విస్తరింపజేయబడింది. మరియు దాని నిజమైన పౌరులుగా జీవించువారియందు నీతి ప్రదర్శింపబడుతుంది.

హృదయంలో దేవుని ఏలుబడి మరియు పరిపాలనయే జీవితాలలో నీతిగా ప్రదర్శింపబడుతుంది. 1930లో అమెరికాలో గొప్ప కాటకం సంభవించిన కాలంలో ఉన్న వ్యక్తిని గూర్చి ఒక కథ చెప్పబడింది. ఆ లేమిడిలో ఏ విధంగాను బాధింపబడని

ఒక సంఘ సభ్యుడతడు. ఇతరులు పేదరికంతో బాధింపబడుతూ ఉండగా, అతడు హాయిగాను ధనంతోను జీవించాడు. ఏదియెలాగున్నా, ఆదివారం ఉదయాన, కలెక్షన్ ప్లేట్ అతని ముందుగా వెళ్లుతున్నప్పుడు అతడొక డాలర్లో పదోవంతు వేశాడట. లోకంలో క్రీస్తు ప్రభువు యొక్క పని జరిగించడానికి అతని ఆర్థిక సహాయం సంఘానికి ఎంతో అవసరమైయుంది. కాని అతడు మానక ఆ పది సెంట్లే వేస్తున్నాడట. వాస్తవంగా అతడు రాజ్యంలో ఉన్నాడు కాని, రాజ్యం అతనిలో లేనట్టు గోచరించింది.

మన హృదయములను దేవుడు ఏలుతూ పరిపాలిస్తున్నప్పుడు మనము రాజ్యము యొక్క నిజ పౌరులమైయుంటాం. దేవుని రాజ్యం నీతి రాజ్యం. ఈ రాజ్యమందలి పౌరత్వమంటే, దేవుని సర్వాధిపత్యాన్ని అంగీకరించి, మన అనుదిన జీవితాలలో ఆయన చిత్తానికి లోబడియుండడమే.

## నిత్య రాజ్యము

మూడవది, సంఘము భూమిమీద దేవుని నిత్య రాజ్యమైయుంది. అది గతించి పోయేదో లేక తాత్కాలికమయ్యిందో కాదు; నిలకడగా ఉండునది, నిశ్చలమైనది, మరియు శాశ్వతమైనది.

పరలోకమందున్న దేవుడు ఒక రాజ్యమును స్థాపించును దానికెన్నటికిని నాశన ముండదని దానియేలు ప్రవచించాడు (దానియేలు 2:44). తాను మెస్సీయాకు భౌతికమైన తల్లియై ఉంటుందని మరియకు తెలిపిన గబ్రియేలు, మెస్సీయా ఏలే రాజ్యము యొక్క శాశ్వత స్వభావాన్ని యిలా సూచించాడు: “ఆయన గొప్పవాడై సర్వోన్నతుని కుమారుడనబడును; **ప్రభువైన** దేవుడు ఆయన తండ్రియైన దావీదు సింహాసనమును ఆయన కిచ్చును. ఆయన యాకోబు వంశస్థులను యుగయుగములు ఏలును; ఆయన రాజ్యము అంతములేనిదై యుండును ...” (లూకా 1:32, 33). తన సంఘాన్ని స్థాపిస్తానని ప్రభువు తన ఉద్దేశాన్ని ప్రస్తావించినప్పుడు, పాతాళలోకద్వారములు దాని యెదుట నిలువ నేరవని ఆయన వాగ్దానం చేశాడు (మత్తయి 16:18). హెబ్రీ. 12:28లో వర్ణింపబడిన దేవుని రాజ్యము నిశ్చల రాజ్యమై ఉంది.

పరలోక రాజ్య పౌరులుగా, క్రైస్తవులు నిత్య జీవం కలిగియున్నారు. ఈ జీవము నేటి అనుభవమును భావి నిరీక్షణయునైయుంది. ప్రభువైన యేసును కలిగియున్నవారు నేడు నిత్యజీవముకలవారై యున్నారు, ఏలాగంటే, ఆయనే నిత్య జీవమైయున్నాడు (1 యోహాను 1:2). అందునుబట్టి యోహాను యిలా వ్రాశాడు, “తన సహోదరుని ద్వేషించు వాడు నరహంతకుడు; ఏ నరహంతకుని యందును నిత్యజీవముండదని మీరెరుగుదురు” (1 యోహాను 3:15). దేవుని రాజ్యముయొక్క స్వభావం క్రైస్తవులుగా నేడు మనం అనుభవించే జీవంలోను, నిత్యత్వమందు పొంద నిరీక్షిస్తున్న జీవంలోను వ్యక్తపరచబడుతుంది.

నిత్యజీవంలోనికి మనం ప్రవేశించడం, తల్లిగర్భంలోనుండి శిశువు లోకంలోనికి ప్రవేశించడంతో పోల్చబడింది. శిశువు తల్లి గర్భంలో ప్రాణాన్ని అనుభవిస్తాడు. వాని

ప్రాణం యొక్క అనుభవం పరిమితియై ఉన్నప్పటికి, అది సౌఖ్యము, పోషణ, మరియు భద్రతతోకూడిన జీవితమై ఉంటుంది. జన్మ సంభవించినప్పుడు, ఆ శిశువు ప్రాణాన్ని అనుభవిస్తాడు, అయితే ఈ జీవితం వ్యత్యాసమయ్యిందిగాను పరిపూర్ణమైన రూపమయ్యింది గాను – సహవాసము, ఎదుగుదల, మరియు కార్యకలాపం అనేవాటికి అంతంలేని అవకాశాలుంటాయి. ప్రభువైన యేసు నేడు మన హృదయాల్లో నివసిస్తుండగా, నూతన మైనదియు, ఆశ్చర్యకరమైన జీవాన్ని – నిత్యజీవాన్ని మనకు ప్రసాదిస్తాడు; అయితే ఈ జీవితంయొక్క వేరొక వైపుకు మనం దాటినప్పుడు, ఈ నిత్యజీవము వ్యత్యాసమైనది మరి పూర్ణమైన రూపంలో, అంటే – పరలోకపు సహవాసములోను, చెప్పనశక్యమైన ఆనందం, మరియు నిత్య సేవలో తన్ను తాను వ్యక్తపరచుకొంటుంది.

కాలంతోగాని, భౌతికమైన కొలతలతోగాని బాధింపబడని నిత్యరాజ్యములో క్రైస్తవులు భాగమైయున్నారు. ఆయన వాక్యానికి నమ్మకంగా ఉంటూ దేవుని భద్రతలో మనం ఈ పరిధియందు నిలిచినంత కాలం, ఎన్నడు లయముకాని, అంతములేని రాజ్యంలో మనం ఉంటాం.

## ముగింపు

క్రైస్తవుని హృదయంలో దేవుని పరిపాలనను ఏలుబడిని మన నిర్మాణ సూచనగా ఉపయోగించుకొని, క్రొత్త నిబంధన సంఘము దేవుని రాజ్యమైయుండి, ఆత్మ సంబంధమైన స్థితి, నీతి, నిత్యత్వమనే లక్షణాలను కలిగియుంది. దాని పౌరులు ఈ లోకంలో జీవిస్తారు కాని, వారి హృదయాలు, వారి పౌరత్వము మరొక లోకానికి, అంటే దేవుని నిత్య రాజ్యానికి చెందినవైయుంటాయి (కొలస్సీ. 3:1, 2; ఫిలిప్పీ. 3:20).

యూదుల అధికారియైన నీకొదేము దేవుని రాజ్యాన్ని గూర్చి అధికంగా తెలిసికొనగోరి ఒక రాత్రి ప్రభువైన యేసును వెదకాడు. జన్మవంటి రూపాంతరపు మార్పు కలిగితేనే ఒకడు దేవుని రాజ్యంలో ప్రవేశించగలడని ప్రభువైన యేసు అతనికి వివరించాడు. యేసు యిలా అన్నారు, "–ఒకడు నీటిమూలముగాను ఆత్మమూలముగాను జన్మించితేనే గాని దేవుని రాజ్యములో ప్రవేశింపలేడని నీతో నిశ్చయముగా చెప్పుచున్నాను" (యోహాను 3:5). భూమిమీద అధికారపూర్వకంగా ఆరంభమైనప్పుడు, ఆ రాజ్యములో ప్రవేశించనై యుండగా, ప్రభువైన యేసునందలి వారి విశ్వాసపు వెలుగులో, మారుమనస్సు పొంది, పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందుడని పేతురు జన సమూహాన్ని హెచ్చరించాడు (అపొ. 2:38–41). యోహాను 3లో ప్రభువు నీకొదేముకు వర్ణించిన క్రొత్త జన్మ అపొ. 2లో పేతురుచే జరిపించబడింది. దేవుని రాజ్యము లేక సంఘములోనికి ప్రవేశము లేక జన్మలో ప్రభువైన యేసునందు విశ్వాసము (యోహాను 3:16), మారుమనస్సు లేక పాపమునుండి దేవుని వైపుకు మరలడం (అపొ. 17:30), యేసు దేవుని కుమారుడని ఒప్పుకొనడం (రోమా 10:9, 10), పాపక్షమాపణ నిమిత్తం క్రీస్తులోనికి బాప్తిస్మం (అపొ. 2:38; 22:16) అనేవాటితో కూడియుంది.

దేవుని రాజ్యపు పౌరత్వం జీవితానికి ఆత్మసంబంధమైన కేంద్రాన్ని, దేవుని ఏలుబడిని,

జీవితంయొక్క ప్రతి కోణంలోను, కొలతల్లోను ప్రకాశింపజేస్తూ, స్థిరత్వాన్ని, మార్గదర్శినాన్ని, గ్రహింపును, పూర్ణత్వాన్ని ప్రసాదిస్తుంది. పరిశుద్ధమైన ఈ పౌరత్వం నీతిని, మంచితనాన్ని, మరియు మన జీవితాల్లోని సమాధానాన్ని తెస్తుంది. తాత్కాలికమైన ఈ లోకంలో, దేవుని రాజ్యం మన జీవితాల్లోనికి నిత్యజీవాన్ని నేటివరకును మరియు మన రేపటికిని ప్రవేశపెట్టింది.

నీవు సంఘమనే, దేవుని నిత్యరాజ్యపు పౌరుడవా?

## స్టడీ మరియు చర్చకొరకైన ప్రశ్నలు

1. సంఘం కలిగియున్న కొన్ని విభిన్న లక్షణాలను పేర్కొనుము. ప్రతి లక్షణానికి క్లుప్తమైన వర్ణన యిమ్ము.
2. సంఘాన్ని రాజ్యంగా చూడాలని ఏ లేఖన భాగాలు సూచిస్తాయి?
3. క్రొత్త నిబంధనలో "రాజ్యము" అనే పదం ఉపయోగింపబడిన వేర్వేరు సందర్భాలను పేర్కొను.
4. సంఘాన్ని గూర్చిన ఏ తీర్మానాలను ఆత్మసంబంధమైన రాజ్య స్వభావం డిమాండ్ చేస్తుంది? తీర్మానాలను తెలిపి వాటిని వర్ణించు.
5. ఆత్మ సంబంధమైన రాజ్యంలో మనం భాగమైయుంటే, నూతన విలువల విధానం మనకు యివ్వబడింది. ఈ విలువల విధానాన్ని చర్చించు.
6. క్రొత్త నిబంధనలో ఏ రెండు విధములైన నీతి ప్రస్తావించబడింది? ప్రతి విధానాన్ని వర్ణించు!
7. దేవుడు స్థాపించే నిత్యరాజ్య స్వభావాన్ని దానియేలు 2:44 వ్యక్తపరచుతుందా?
8. దేవుని రాజ్యము నేడు ఒక అనుభవం, భవిష్యత్తుకొరకు అది ఒక నిరీక్షణ ఎలాగో చర్చించు.
9. నిత్యజీవం యిక్కడ యిప్పుడు ఎలా వ్యక్తపరచబడిందో, అది నిత్యత్వంలో ఎలా వ్యక్తపరచబడుతుందో చర్చించు.
10. మన పరలోకపు పౌరత్వము నేటి మన జీవితాలలో ఏ సూచనలు కలిగియున్నది?
11. దేవుని రాజ్య ప్రవేశం ఎలా జరుగుతుంది?
12. యోహాను 3:3, 5లను అపో. 2:38తో పోల్చు.